క్లుప్తంగా

కరాటే గోల్డ్ మెడలిస్ట్‌కు సన్మానం



మయూరిని సన్మానిస్తున్న మంత్రి సబితారెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని ఆకులమైలారంకు చెందిన విద్యార్థిని కె.మయూరి గోవాలో నిర్వహించిన 3వ ఆసియా అంతర్జాతీయ గర్ల్స్ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. ఇటీవల గోవాలో జరిగిన కరాటే పోటీల్లో గోల్డ్‌మెడల్‌తో పాటు ఓవరాల్ గ్రాండ్ ఛాంపియన్‌షిప్ అవార్డును సైతం ఆమె దక్కించుకుంది. కాగా శుక్రవారం మయూరితో పాటు కోచ్ అభిని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి తన నివాసంలో అభినందించారు. వారి వెంట పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, రైతు సమన్వయ సమితి కమిటీ అధ్యక్షుడు కృష్ణరాంభూపాల్ రెడ్డి, సర్పంచ్ గొరిగె కలమ్మరాజు, మాజీ సర్పంచ్ నందీశ్వర్, నాయకులు రాజు, సదానంద్‌గౌడ్, అల్లం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బహిరంగ సభను విజయవంతం చేయండి

పార్టీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్

తుక్కుగూడ: దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటన సందర్భంగా నిర్వహించే బహిరంగసభను జయప్రదం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రధాని మోదీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వందే భారత్ రైలు ప్రారంభించిన అనంతరం పరేడ్‌గ్రౌండ్ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సభకు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల నుంచి కార్యకర్తలు భారీ ఎత్తున హాజరవ్వాలని కోరారు.

వర్చువల్ ఎన్‌పీఈ సమావేశం విజయవంతం

బడంగ్‌పేట్: నూతన విద్యావిధానం–2020పై పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మరియు ఢిల్లీ పబ్లిక్ పాఠశాలల ఆధ్వర్యంలో మూడు రోజులుగా అభ్యసన అంతరాలపై ఆన్‌లైన్‌లో చర్చ నిర్వహించారు. పలు రాష్ట్రాల్లోని విద్యావేత్తలు, సైంటిస్టులు, మేధావులు, ప్రొఫెసర్లు, తల్లిదండ్రులు పాల్గొని విలువైన సూచనలు, విద్యావిధానంలో తీసుకోవలసిన మార్పులు తదితర అంశాలపై సూచనలు అందించారు. విలువైన సూచనలు, సలహాలు ఇచ్చిన ప్రతీ ఒక్కరికి పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ మల్క కొమురయ్య శుక్రవారం ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచీకరణ, మాసిఫికేషన్, ఎంప్లాయిబిలిటీ, ఇండస్ట్రీ, ఇంటర్‌స్పేస్, పర్యావరణ, ఇంక్లూజివిటీ, సామాజిక మరియు పాలన మొదలైన అంశాలపై తమ అభిప్రాయాలు తెలిపారన్నారు. మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ ప్రాముఖ్యాన్ని వివరిస్తూ.. అది ఎన్నో రకాల అవకాశాలను అందిస్తుందని ప్రస్తుత కాలంలో ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుందని ప్రొఫెసర్ ఆర్‌కే మిశ్ర వివరించారన్నారు. ఇన్ఫ్రాస్ట్రక్చర్, లెర్నింగ్, టీచింగ్, అక్రిడిటేషన్ మొదలైన అంశాల్లో మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ ప్రధాన భూమిక పోషించి గొప్ప మార్పు తీసుకువస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్యానలిస్టులుగా ఐఎస్‌బీ డైరెక్టర్, ప్రొఫెసర్ అజయ్ సింగ్, ఐపీఈ మాజీ డీన్ సాయికుమార్, ఐసీబీఎం డైరెక్టర్ జరార్, ఈ అండ్ వై వీపీ వినాయక్ మిశ్రా, జైపురియా ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్ కుమార్ అశీశ్, డాక్టర్ సులగ్న సర్కార్, ఐపీఈ ప్రొఫెసర్ కిరణ్మయి, డీవీ.రమణ, ఆర్‌కే.మిశ్రా, కె.నీరజ మోడరేటర్లుగా వ్యవహరించారు. విజయవంతం చేసిన విద్యాసంస్థల సీఈఓ మల్క యశస్వి, అకాడమిక్ డైరెక్టర్ టి.సుధకు ధన్యవాదాలు తెలిపారు. ఈ విలువైన సమాచారాన్ని పొందుపరిచి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నూతన విద్యావిధానం నిర్వాహకులకు(ఎన్‌ఈపీ–2020) అందచేస్తామని వెల్లడించారు.

పరీక్ష ప్రశాంతంగా రాయండి

ఫిజికల్ డైరెక్టర్ నందులాల్ నాయక్



హుడాకాంప్లెక్స్: ఎస్‌ఐ మెయిన్స్ పరీక్ష రాస్తున్న అభ్యర్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని ఫిజికల్ డైరెక్టర్ నందులాల్ నాయక్ అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ ఎస్‌ఐ పరీక్షకి కఠోర సాధన చేస్తూ ఈవెంట్స్, ప్రిలిమ్స్ దాటి మెయిన్స్ పరీక్షను రాస్తున్నారని తెలిపారు. మెయిన్స్ పరీక్ష మీ భవిష్యత్తుని నిర్ణయిస్తుంది కాబట్టి సమయాన్ని వృథా చేసుకోకుండా తడబడకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసి భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని సూచించారు. నందు ఆర్మీ తరపున పరీక్ష రాసే ప్రతి అభ్యర్థికి ఆల్ ది బెస్ట్ చెప్పారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

కందుకూరు: మండల పరిధిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వివిధ గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిల్లో పాస్టర్లు క్రీస్తు బోధనలతో పాటు ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.

శరవేగంగా సుందరీకరణ

- రూ. 3.50కోట్లతో మంత్రాల చెరువు అభివృద్ధి పనులు
- రూ. 2కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో లైటింగ్ సిస్టం



కొనసాగుతున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు



చెరువు వద్ద నిర్మించిన ఫుట్‌పాత్

మీర్‌పేట: మంత్రాల చెరువు సుందరీకరణ పనులు చకచకా సాగుతున్నాయి. కార్పొరేషన్ పరిధిలోని మూడు చెరువుల్లో ఇప్పటికే చందన చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేచ్చారు. మంత్రాల చెరువు సుందరీకరణ కోసం రూ. 3.50కోట్లు వెచ్చిస్తున్నారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఫుట్‌పాత్, రెయిలింగ్, బతుకమ్మ ఘాట్, ఫౌంటెన్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కును నిర్మించనున్నారు. ఇప్పటికే వాకింగ్ ట్రాక్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం ఆర్‌సీఐ రోడ్డు వైపు రూ. 50లక్షలతో ప్రత్యేకంగా చెరువులో చేపడుతున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు సాగుతున్నాయి. చెరువు వద్ద ప్రజలను ఆకట్టుకునేలా విగ్రహాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రూ. 2కోట్లతో లైటింగ్

చెరువు సుందరీకరణతో పాటు చెరువు చుట్టూ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఇందు కోసం హెచ్‌ఎండీఏ నుంచి రూ. 2కోట్లు వెచ్చించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

“నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తాం



మంత్రాల చెరువు సుందరీకరణ పనులు తుది దశకు చేరుకుంటున్నాయి. పనులు పూర్తయితే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందుబాటులోకి వస్తుంది. పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం. నెల రోజుల్లో సుందరీకరణ పనులు పూర్తి చేస్తాం.

– గోపీనాథ్, డీఈ, మీర్‌పేట కార్పొరేషన్

లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం

కార్పొరేటర్ దీపికారెడ్డి

బడంగ్‌పేట్: వేసవిలో విద్యుత్ అంతరాయంతో పాటు లోఓల్టేజీ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు 5వ డివిజన్ కార్పొరేటర్ బోయపల్లి దీపికారెడ్డి తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని 5వ డివిజన్ వినాయకహిల్స్ ఫేస్–2లో కొంత కాలంగా లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె మంత్రి సబితారెడ్డి సహకారంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు. వెనువెంటనే కాలనీలో బిగించారు. శుక్రవారం కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవికాలంలో విద్యుత్ సమస్య లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బోయపల్లి శేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఉన్నారు.



నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దీపికారెడ్డి

ముంపు ముప్పు అరికట్టేందుకు మూడో టర్నెల్

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువు పరిసరాల్లోని లోతట్టు కాలనీలు ముంపునకు గురికాకుండా ఉండేందుకు మూడో టర్నెల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ సందర్శించిన ఎమ్మెల్యే అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు.వర్షాకాలంలో చెరువు నీరు ఓవర్ ఫ్లో కాకుండా నీటి మట్టాన్ని నియంత్రించేందుకు టర్నెల్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రెండు మార్గాల ద్వారా నీరు బయటకు విడుదల చేస్తున్నారని, ఇప్పుడు నిర్మించే మూడో టర్నెల్ వల్ల అవసరమైన సమయంలో నీటిని త్వరగా బయటకు పంపవచ్చని అన్నారు. మూడు, నాలుగు నెలలుగా పనులు నత్తనడకన నడుస్తున్నాయని, పనుల్లో వేగం పెంచి ఈ నెలాఖరు వరకు పూర్తి చేస్తామన్నారు. అంచనాలను మించి ఖర్చు అవుతున్నందువల్ల కాంట్రాక్టర్‌కు అదనంగా చెల్లించాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, డివిజన్ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, నాయకులు రమేష్ ముదిరాజ్, కృష్ణ, శివరాం, సుధీర్, వర్షిత్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.



సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మంత్రి చొరవతోనే అభివృద్ధి పనులు

తుమ్మలూరు సర్పంచ్ సురేఖారెడ్డి

మహేశ్వరం: మంత్రి చొరతోనే అభివృద్ధి పనులు చేపడుతున్నామని తుమ్మలూరు సర్పంచ్ మద్ది సురేఖారెడ్డి అన్నారు. మండల పరిధిలోని తుమ్మలూరు గేటు నుంచి శ్రీశైలం రహదారి మీదుగా తుమ్మలూరు వరకు రూ.14.20 కోట్ల నిధులతో డబుల్ రోడ్డు నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ పనులను గ్రామ సర్పంచ్ వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మంత్రి, సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి సహకారంతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తైతే ప్రజల రాకపోకలకు అనువుగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వారు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కటికల శ్రీహరి ముదిరాజ్, మాజీ సర్పంచ్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మద్ది కరుణాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు గోవర్ధన్, మౌనిక, రేఖ, బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బుసగళ్ల జంగయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ గంట వెంకట్‌రెడ్డి, తులసీరెడ్డి, రైతు కమిటీ గ్రామ అధ్యక్షుడు ఎండీ.మహబూబ్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

‘ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా?’

చైతన్యపురి: ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా అని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి ప్రశ్నించారు. ఎస్ఎస్‌సీ ప్ర శ్న పత్రాల లీకేజీపై ఆందోళన చేసిన కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడంపై ఆయన ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్న పత్రాలను లీక్ చేస్తూ నిరుద్యోగ యువత జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతోందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రికి ఆత్మీయ సమ్మేళనంపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్ నిర్ణయించే పరీక్షలపై లేకుండా పోయిందన్నారు. ఒక మంత్రిగా ఉన్న ఆమె ప్రభుత్వ కార్యక్రమంలో తహసీల్దార్‌ను నిల్చోబెట్టి, ప్రభుత్వంతో సంబంధం లేని వ్యక్తులను స్టేజీపై కూర్చోబెట్టిందని, ఆమెకు అధికారులంటే ఎంత చిన్న చూపో ఈ ఘటన తెలియజేస్తోందని అన్నారు. ఉన్నతాధికారి అయినప్పటికీ తనను మొబైల్ ఫోన్‌ను పరీక్ష కేంద్రంలోకి తీసుకుని పోవద్దన్న మహిళా కానిస్టేబుల్ కల్పనను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అభినందించడమే కాకుండా సక్రమంగా విధులు నిర్వహించినందుకు రివార్డు ప్రకటించారని అన్నారు. సక్రమంగా విధులు నిర్వహించే ప్రభుత్వ అధికారులను ఎలా గౌరవించాలో ఆయనను చూసి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు నేర్చుకోవాలని హితవు పలికారు. ప్రశ్నించే గొంతులపై ఉక్కుపాదం మోపుతూ అణచివేసే కుట్ర చేస్తున్న తెలంగాణ నిరంకుశ ప్రభుత్వాన్ని త్వరలో కూల్చే రోజులు దగ్గర పడ్డాయన్నారు.

మనస్తాపంతో వ్యక్తి అదృశ్యం

హస్తినాపురం: భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...ఎఫ్‌సీఐ కాలనీ నివాసి కైరకొండ శివకుమార్ (30)కు అదే కాలనీకి చెందిన ప్రసన్నతో వివాహం జరిగింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరుగుతోంది. గురువారం భార్యతో మళ్లీ గొడవ జరగడంతో మనస్తాపం చెందిన శివకుమార్ ఇంట్లోని వారికి చెప్పకుండా బైక్ (నం.టీఎస్08జీఏ 7763)పై బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కంగారుపడ్డ కుటుంబ సభ్యులు శివకుమార్ ఆచూకీ కోసం బంధు,మిత్రులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



5కే వాక్‌ను ప్రారంభిస్తున్న ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ

దిల్‌సుఖ్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్‌కేపురంలోని ఓజోన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆరోగ్యానికి నడక ప్రాధాన్యంపై అవగాహన కల్పించేందుకు 5కే వాక్ నిర్వహించారు. ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ ముఖ్యఅతిథిగా విచ్చేసి 5కే వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యమని, మన దగ్గర ఎన్ని డబ్బులు ఉన్నా.. ఆరోగ్యం లేకపోతే అన్నీ వృథా అని అన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో కొత్త సమయం నడవాలని సూచించారు. కొత్తపేటలోని ఓజోన్ హాస్పిటల్స్ నుంచి ప్రారంభమై 5కే వాక్ ఎల్బీనగర్ రింగ్ రోడ్డు వరకు కొనసాగింది. ఓజోన్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఇంద్రసేన రెడ్డి, సీఓఓ డాక్టర్ కరుణాకర్ రెడ్డి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, లయన్ యాదయ్యగౌడ్, పగిళ్ల భూపాల్‌రెడ్డి, డాక్టర్ విజయరంగ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

చైతన్యపురి: కాలనీల్లోని సమస్యలను పరిష్కరించి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నానని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. డివిజన్‌లోని బాబు కాంప్లెక్స్, ఫణిగిరి కాలనీ, ప్రభాత్‌నగర్ కాలనీల్లో శుక్రవారం ఆయన పర్యటించి స్థానికులను ఆయా కాలనీల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు ఉన్నాయని, పరిష్కరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు



దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

యాచారం: దివ్యాంగుల సంక్షేమం, వారి అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషి చేయాలని కొత్తపల్లి గ్రామానికి చెందిన కార్యకర్త దెంది రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన గ్రామంలోని దివ్యాంగులకు ఆర్టీసీ బస్ పాసులను అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు శ్రీరాములు, జంగయ్య, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

హస్తినాపురం: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ యోగాసనాలు వేయాలని శ్రీ షిరిడీసాయి అష్టాంగ యోగా శిక్షణ వ్యవస్థాపకుడు ఇస్మాయిల్ గురూజీ అన్నారు. షిరిడీ సాయి అష్టాంగ యోగ శిక్షణ కార్యక్రమాలు కర్మన్‌ఘాట్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కర్మన్‌ఘాట్ పరిసరాల్లోని కాలనీవాసులు ఈ యోగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ గురూజీ మాట్లాడుతూ, ప్రస్తుతం కోవిడ్ వంటి భయాలు వెంటాడుతున్న తరుణంలో శరీరంలో వ్యాధి నిరోధక వ్యవస్థను పెంచుకోవడానికి ఈ యోగా శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం , సాయంత్రం నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని వ్యాయామాలు, సూర్యనమస్కారాలు, ఆసనాలు నేర్చుకోవాలని ఇస్మాయిల్ గురూజీ సూచించారు.



యోగా సాధన చేస్తున్న స్థానికులు

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

ఆమనగల్లు: ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించే ఎస్‌ఐ, 21న నిర్వహించే తుది రాత పరీక్షలకు హాజరు అవుతున్న అభ్యర్థులు ఆత్మ విశ్వాసం కోల్పోవద్దని ఆమనగల్లు సీఐ ఉపేందర్ సూచించారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో శుక్రవారం సీఐ ఉపేందర్ విలేకరులతో మాట్లాడుతూ.. గతేడాది కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రెండు నెలల పాటు పోలీసు ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణిచ్చామన్నారు. అప్పట్లో శిక్షణ పొందిన వారిలో దాదాపు 70మంది ప్రాథమిక పరీక్ష, దేహదారుఢ్య పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి తుది రాత పరీక్షకు ఎంపికయ్యారని ఆయన చెప్పారు.

సర్వీస్‌రోడ్ల ఆక్రమణతో ట్రా‘ఫికర్’

- తోపుడుబండ్ల వ్యాపారుల తిష్ట
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న కాలనీవాసుల
- సాయంత్రం వేళ కాలినడకకూ ఇబ్బందే



ప్రభాత్‌నగర్ కాలనీ టర్నింగ్‌లో సర్వీస్ రోడ్డుపై ఆక్రమణలు

చైతన్యపురి: చిరు వ్యాపారులు, తోపుడుబండ్లు ఆక్రమించుకోవటం వల్ల సర్వీస్ రోడ్లు కుంచించుకు పోయి వాహనదారులు, పాదచారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇక్కడ నుంచి గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ తరలి వెళ్లినప్పటికీ.. వ్యాపారాలు ఇంకా ఇక్కడే కొనసాగిస్తుండటంతో స్థానికులు కొత్త సమస్యలను ఎదుర్కొంటున్నారు.

- చైతన్యపురి డివిజన్‌లోని చైతన్యపురి చౌరస్తా నుంచి కొత్తపేట బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు సర్వీస్ రోడ్డు, ప్రభాత్‌నగర్ కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారిలో చిన్న ట్రాలీ ఆటోల్లో పండ్లను పెట్టుకొని విక్రయిస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- రోడ్లపై అక్రమ పార్కింగ్‌ల కారణంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.
- ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌ల వల్ల ప్రభాత్‌నగర్ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు చైతన్యపురి మెట్రో స్టేషన్‌కు వచ్చే ప్రయాణికుల రాకపోకలకు కష్టమవుతోంది.
- సర్వీస్ రోడ్డు పక్కనే రెండు జూనియర్ కళాశాలలు, ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. ట్రాఫిక్ జామ్ అయి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.
- ప్రభాత్‌నగర్, సత్యనారాయణపురం, మారుతీనగర్, సాయినగర్, కాలనీలకు ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, కార్లు, పాదచారులు ఈ సర్వీస్ రోడ్డు మీదుగానే కాలనీల్లోకి వెళ్లాల్సి ఉంటుంది.
- సర్వీస్ రోడ్డు ఆక్రమణలకు గురి కావటంతో సాయం కాలం వేళల్లో కార్లు, ద్విచక్ర వాహనాలు అటుంచి కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంటోంది.
- ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకోవటమే కాకుండా కొందరు సర్వీస్ రోడ్డుపైనే తమ వస్తువులు పెట్టుకుని వ్యాపారాలు కొనసాగించటం వల్ల సమస్య మరింత పెరిగుతోంది.
- కాలనీ రోడ్డుపై పండ్ల వ్యాపారుల వాహనాలను నిలపకుండా చూడాలని ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందంటున్నారు.
- వారం రోజుల క్రితం జరిగిన కాలనీ సమావేశంలో కూడా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామని, సమస్య పరిష్కరించాలని కోరామని తెలిపారు.
- సర్వీస్ రోడ్లు ఆక్రమించుకోవటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కనీసం జీహెచ్‌ఎంసీ అధికారులు కానీ, ట్రాఫిక్ అధికారులు కానీ పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డు ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



చైతన్యపురి మెట్రో స్టేషన్ సమీపంలో తోపుడు బండ్లతో నిండిన సర్వీస్‌రోడ్డు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



చైతన్యపురి చౌరస్తా నుంచి కొత్తపేట క్రాస్ రోడ్డు వరకు ఉన్న సర్వీసు రోడ్ల ఆక్రమణలకు గురి కావటం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సర్వీస్ రోడ్డులో కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా ఉండంటం లేదు. ప్రభాత్‌నగర్ కాలనీలోకి వెళ్లే మార్గంలో కార్లు, ద్విచక్ర వాహనాలు నడపటం అంటే పద్మవ్యూహంలోకి వెళ్లినంత పని అవుతోంది. హెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలి.

– పల్‌రెడ్డి రమణారెడ్డి, ప్రభాత్‌నగర్ కాలనీ